ఇంకొద్దిసేపట్లో మాధురికి తెలిసిపోతుంది తను పారిపోయిన విషయం. వెంటనే వాళ్ళు ఆదేశిస్తారు తన కోసం వేట ప్రారంభించమని! ముందుగా తనింటికెళతారు వాళ్ళు. వాళ్ళకూ తెలుసు.

తను తిన్నగా తులసి దగ్గరకెళ్ళకూడదు. ఊళ్ళో ఏదయినా హోటల్లో రూమ్ తీసుకుని వారం రోజులు గది బయటకు రాకుండా గడపాలి. వాళ్ళ హడావుడి అంతా సద్దుమణిగాక అప్పుడు తులసిని కలుసుకుని హైద్రాబాద్ నుంచి మకాం ఎత్తివేయాలి. ఏ మారుమూల గ్రామానికో పారిపోయి అక్కడ కొత్త జీవితం ప్రారంభించాలి.

కారు సిటీ దగ్గరగా వచ్చేసింది. ఉండుండి ఎదురుగా కార్లు, ఆటోలు వస్తున్నాయ్.

హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చిందతనికి?

కారు తీసుకెళ్ళి రైల్వేస్టేషన్ దగ్గర వదిలేస్తే- తను రైల్లో ఎక్కడికో పారిపోయాడని వాళ్ళనుకోటానికి ఆస్కారం వుంది. ఆ విధంగా వాళ్ళను తప్పుదారి పట్టించవచ్చు. కారు సిటీలో కొచ్చేసింది. రైల్వేస్టేషన్ చేరుకోగానే కారు దిగి ప్రత్యూషతోపాటు ఆటో ఎక్కాడు.

కోఠీ చేరుకుంది ఆటో.

"ఎక్కడయినా మంచి లాడ్జింగ్ వుంటే తీసుకెళ్ళు" ఆటో డ్రైవరుతో చెప్పాడు సురేష్ . ఆటో సుల్తాన్‌బజార్లోని ఓ హోటల్ ముందు ఆగింది. కంజెస్టెడ్‌గా ఉన్నా అదే మంచిదనిపించింది సురేష్‌కి.

"ప్రత్యూషా! నా దగ్గర డబ్బు లేదు" అన్నాడు.

ఆమె తన బ్యాగ్‌లో నుంచి ఓ చిన్న పర్స్ తీసి అతనికిచ్చింది "ఇది వాడండి" అంది పొడిగా.

ఇంకా ఆమె కళ్ళల్లో బెదురుపోలేదు.

కౌంటర్ దగ్గరతను ప్రశ్నార్థకంగా చూశాడు.

"డబుల్ రూమ్ కావాలి!" అన్నాడు సురేష్ .

"సారీ సర్! ఓన్లీ సింగిల్ రూమ్ ఎవైలబుల్."

సురేష్‌కి చిరాకు పుట్టుకొచ్చింది.

"ఏదోటి-త్వరగా యివ్వడి!"

అతను అనుమానంగా చూశాడు సురేష్ వైపు.

"లాంగ్జర్నీ-బాగా అలసిపోయి వున్నాం-డబుల్ రూమ్ ఖాళీ అవగానే ఇద్దురుగానీ ఇవాల్టికి సింగిల్ రూమ్‌లో ఎడ్జస్ట్ చేసుకుంటాం" అతనలా అబద్ధాలు చెప్తుంటే ప్రత్యూష ఆశ్చర్యంగా చూస్తోంది

అతను మాట్లాడకుండా వివరాలన్నీ రాసుకుని బోయ్‌ని పిలిచాడు.

ఇద్దరూ బోయ్‌తో మేడమెట్లు ఎక్కసాగారు రెండో అంతస్తులో ఓ మూల వుందా గది.

చాలా ఇరుగ్గా ఒక్క మనిషికి సరిపోయేంత చిన్నదిగా, ఓ మంచం, టేబులూ ఓ కుర్చీ-

గదిలోకి వెళ్ళగానే గది తలుపు మూసి, లోపల బోల్ట్ వేశాడు.

అప్పుడు ధైర్యం వచ్చిందతనికి.

"ప్రత్యూషా! నా ప్రాణం రక్షించావ్-నీ ఋణం ఎలా తీర్చుకోను?" అన్నాడు ప్రేమగా.

ఆమె నవ్వింది "నాకింకా అంతా అగమ్యగోచరంగానే వుంది. నువ్వు సురేష్ వంటే...."

"అంతా రేపు చెప్తాను ప్రత్యూషా! ఇవాళ మాత్రం హాయిగా నిద్రపోతాను! కంటినిండా నిద్రపోయి ఎన్ని రోజులయిపోయిందో తెలుసా?"

అతను లేచి మంచంమీద పడుకున్నాడు. ఆమె కిటికీ కర్టెన్ తొలగించి పక్కనే కనబడుతున్న ఇరుకు సందువేపు చూస్తోంది. సైకిళ్ళు. రిక్షాలు ప్రవాహంలా పోతున్నాయి. అతనితో ఆ గదిలో గడపటం ఆమెకు వింతగా ఉంది.

అతను సురేష్ అని నమ్మాలంటేనే ఏమిటోగా వుంది. ఒకవేళ అతను పాత సురేష్ రూపంతో వున్నా అతనితో యిలా గడపాలంటే....

చటుక్కున మంచం మీద నుంచి లేచి కూర్చున్నాడు సురేష్ .

అప్పుడు గుర్తుకొచ్చిందతనికి-గదిలో ఒకటే మంచం వుందని. లేచి ప్రత్యూష దగ్గరకు నడిచి ఆమె చేయి పట్టుకున్నాడు.

"నువ్వు మంచం మీద పడుకో ప్రత్యూషా! నేను కింద బెడ్‌షీట్ వేసుకుని పడుకుంటాను."

"ఊహు! మీరే పడుకొండి."

"కాదు నువ్వే."

"సరే! ఇద్దరం రాజీకొద్దాం. ఇవాళ్టికి నువ్వు మంచం మీద పడుకో, రేపు నేను పడుకుంటాను. సరేనా?"

ఆమె నవ్వింది "మీ యిష్టం."

ఆమె మంచం మీద పడుకుంది. ఇద్దరికీ వెంటనే నిద్ర పట్టేసింది. సురేష్‌కి తిరిగి మెలకువ వచ్చేసరికి తెల్లారిపోయింది. న్యూస్‌పేపర్ తలుపు దగ్గర పడివుంది.

తీసుకుని ఓసారి పేపరంతా కలియజూశాడతను.

పేపర్ పక్కన పడేయబోతూండగా కన్పించింది బాక్స్ అయిటమ్.

"గుర్తు తెలీని వ్యక్తి దారుణ మరణం"

పేపర్ దగ్గరకు తీసుకుని ఆ వార్తంతా చదివాడతను.

"గత రాత్రి పన్నెండు గంటలకు ఫుల్‌సూట్‌లో వున్న వ్యక్తి కాచిగూడా చౌరస్తా దగ్గర కారు ప్రమాదంలో మరణించాడు. వెనుక వీల్ అతని మొహం మీదనుంచి వెళ్ళటం వలన అతని

ముఖం గుర్తుపట్టడానికి వీల్లేకుండా పోయింది. ఇతర గుర్తులనుబట్టి అతని పేరు శరత్ అనీ అతను ఉద్యోగం కోసం సిటికీ వచ్చినట్లు తెలుస్తోంది".

సురేష్ నోరు తెరుచుకుని వుండిపోయాడు. గొంతు తడారిపోతోంది. శరత్‌ని చంపేశారు నిన్న రాత్రే తప్పించుకుని పారిపోయే ముందు చెప్పాడు తనకు. ఎక్కడున్నా వెతికి పట్టుకుని చంపేస్తారని.

చేతిలో నుండి పేపర్ జారి పడిపోయింది.

ప్రత్యూష కళ్ళు తెరిచింది.

పాలిపోయిన అతని ముఖం చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమిటలా అయిపోయారు" అంది లేచి కూర్చుంటూ.

సురేష్ ఆమెవేపు అయోమయంగా చూశాడు.

"వాళ్ళు శరత్‌ని వేటాడి చంపేశారు" గొంతులో వణుకును కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నం చేశాడు.

ప్రత్యూష కళ్ళల్లో భయం కన్పించింది.

"అంటే...."

సురేష్ తడబడుతోన్న అడుగులతో పచార్లు మొదలుపెట్టాడు.

"అవును ప్రత్యూషా! వాళ్ళు మన కోసం ఈపాటికి వేట ప్రారంభించి వుంటారు"

ప్రత్యూష కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా వుండిపోయింది.

"కానీ ఇంత మారుమూల హోటల్లో మనం వున్నట్లు వాళ్ళు కనుక్కోవటం కష్టమనుకుంటాను?"

సురేష్ జీవం లేని నవ్వు నవ్వాడు.

"శరత్‌ని కనుక్కోలేమూ? 24 గంటల్లోగా వెతికి వేటాడి చంపేశారు. శరత్ ఏం చెప్పాడో తెలుసా? ఈ నగరంలో ఎవరే మూల దాగినా 24 గంటల్లో పట్టేసుకోగలరట. ఇంతవరకూ వాళ్ళ చేతుల్నించి తప్పించుకున్నవారే లేరట".

ప్రత్యూష లేచి అతనికి సమీపంగా వచ్చి నిలబడింది.

సురేష్ పచార్లు చేయటమాపి ఆమె ముఖంలోకి చూశాడు. అప్రయత్నంగా అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుందామె.

"ధైర్యంగా వుంటే మనల్నెవరూ ఏమీ చేయలేరు" అంది చిరునవ్వుతో.

సురేష్ సిగ్గుపడ్డాడు.

ఆమెకున్న ధైర్యం తనకు లేకుండా పోతోంది. తన చేతిని తీసేసుకుని కుర్చీలో కూర్చుని మనసు స్థిమితపరచుకోటానికి ప్రయత్నించసాగాడు.

నిజంగా తామిద్దరూ వాళ్ళను తప్పించుకోగలరా? తామిద్దరి కోసం వాళ్ళు రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్‌లూ అన్నీ వెతుకుతారు. తన ఇంటి దగ్గర కాపలా కాస్తారు. తను తులసి దగ్గరకు వస్తాడని. నగరంలోని హోటల్స్ అన్నీ వెతుకుతారు.

అతని గుండె ఝల్లుమంది. నిజంగా హోటల్సన్నీ వెతుకుతారా? కౌంటర్‌లో తామిద్దరి వివరాలూ కనుక్కోవటం చాలా తేలిక.

ప్రత్యూష బాత్‌రూంలో నుంచి టవల్‌తో ముఖం తుడుచుకుంటూ బయటికొచ్చింది. అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటూ అద్దంలో కనబడుతోన్న అతని ప్రతిబింబం చూసి నవ్వింది.

“ఇంకా భయపడుతూనే వున్నారు కదూ?” అంది హేళనగా.

“ఆ ...లే...దు” అన్నాడు సురేష్ తడబడుతూ.

ఆమె గట్టిగా నవ్వేసింది.

“ప్రాణంమీద మీకు యింత తీపి అని తెలీదు” అంది అతనినింకా వుడికిస్తూ.

సురేష్ పౌరుషంగా లేచి నిలబడ్డాడు.

“ప్రాణం మీద తీపని కాదు! కానీ అలాంటి వాళ్ళ చేతిలో నా జీవితం అంతం కావటం నాకిష్టంలేదు. నా తులసితో నేను అద్భుతమయిన జీవితం గడపాల్సి వుంది.”

“సురేష్!” అతనివేపు తిరిగింది.

“అద్భుతమైన జీవితం తులసి తోనే గడపాలా?” కవ్వింపు కనబడుతోంది ఆమె కళ్ళల్లో, ఆమె ప్రశ్నలో.

సురేష్‌కి నవ్వొచ్చింది. జవాబు చెప్పేప్పుడు కొంచెం తడబడ్డాడు.

“ఎస్! మోస్ట్‌లీ.”